డ్రాయింగ్ శిక్షణ ప్రారంభం

కోటగిరి, ఫిబ్రవరి 6 : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ –హైదరాబాద్ ఆధ్వర్యంలో డ్రాయింగ్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఉచితంగా 40 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీనివాస రావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రమేశ్‌బాబు తెలిపారు. కోటగిరి ఉన్నత పాఠశాలలోని 6,7,8వ తరగతులకు చెందిన 30 మంది విద్యార్థినులకు శిక్షణ ఇవ్వడంతోపాటు సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షకురాలు సౌందర్య, టీచర్ సుమ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు నుంచి బైక్ చోరీ

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 6 : నగరంలోని ఫోర్ట్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో ఓ ఇంటి ఎదుట పార్క్ చేసి ఉంచిన బైక్ చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ రోడ్డులో రోటరీనగర్‌లో ఉండే బోగ నర్సింగ్ తన ద్విచక్ర వాహనాన్ని బుధవారం రాత్రి ఇంటి ఎదుట పార్క్ చేసి ఉంచాడు. ఉదయం నిద్ర లేచి చూసే సరికి బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాట స్థావరంపై దాడి

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 6 : రూరల్ పోలీస్‌స్టేషన్ ఏరియాలోని లక్ష్మీప్రియనగర్–కస్తూర్బా కాలనీలో ఓ ఇంట్లో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో గురువారం దాడి చేశారు. పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.30,500 నగదుతోపాటు 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సీఐ అంజయ్యతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. జూదరులను రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు వెల్లడించారు.

జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు శశిధర్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 6 : కర్ణాటక రాష్ట్రంలోని బల్లారి జిల్లాలో ఈనెల 7 నుంచి 10 వరకు నిర్వహించే 70వ పురుషుల జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు తెలంగాణ పురుషుల తుదిజట్టుకు జిల్లా సీనియర్ క్రీడాకారుడు శశిధర్ ఎంపికైనట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్యామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఉచిత ఆరోగ్య శిబిరం

సారంగాపూర్, ఫిబ్రవరి 6 : రూరల్‌మండలంలోని కొండూర్ గ్రామంలో వాయుపుత్ర యువజన సంఘం, ఎన్‌వైకే ఆధ్వర్యంలో గురువారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. నగరంలోని సన్‌రైజ్ దవాఖాన ఆధ్వర్యంలో 150 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్, యూత్, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక యువకుడి ఆత్మహత్య

రుద్రూర్, ఫిబ్రవరి 6 : వర్ని మండలం ఒడ్డేపల్లి గ్రామానికి చెందిన వల్లెపు చిన్న పోశెట్టి (23) ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోశెట్టి భార్య రెండు సంవత్సరాల క్రితం వదిలి వెళ్లిందని, ఒంటరిగా జీవిస్తూ, మనస్తాపంతో బుధవారం మధ్యాహ్నం ఇంటివద్ద ఎలుకల మందు తాగాడు. నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ అదేరోజురాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అర్హులకు అల్బెండజోల్ మాత్రలు వేయాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

డిచ్‌పల్లి/ పొతంగల్, ఫిబ్రవరి 6 : నులిపురుగుల నివారణ కోసం అర్హులైన పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు అందజేయాలని జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు. డిచ్‌పల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలల అధ్యాపకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు జాతీయ నులిపురుగుల నివారణపై గురువారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా 1 నుంచి 19 ఏండ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. 10న మాత్రలు వేసుకోని వారికి ఈనెల 17న తప్పకుండా వేయాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ సుశాంత్‌రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఆరోగ్య బోధకులు స్వామి, సులోచన, ఆరోగ్య విస్తీర్ణాధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకుడు రాజేందర్ తదితరలు పాల్గొన్నారు.

పొతంగల్ మండలంలోని పీహెచ్‌సీలో నులిపురుగుల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. వైద్యారోగ్య సిబ్బందికి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అలీముద్దీన్ అల్బెండజోల్ మాత్రల పంపిణీపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు సుజాత, సావిత్రి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

దవాఖానను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ

ధర్పల్లి, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ దవాఖాన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆమె గురువారం తనిఖీ చేశారు. దవాఖానలో చేసిన ప్రసవాల గురించి అడిగి తెలుసుకొని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టీకాల గది, ఐపీ, ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు.

దవాఖానను తనిఖీ చేసిన డీసీహెచ్‌ఎస్

ధర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను జిల్లా ఆస్పత్రుల సర్వీసుల కో–ఆర్డినేటర్ (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. 30 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో నూతనంగా చేపట్టిన దవాఖాన నిర్మాణ పనులను పరిశీలించారు. మరో రెండేండ్లలో భవనం పూర్తవుతుందని తెలిపారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శివశంకర్, డాక్టర్ మౌనిక, నర్సింగ్ ఆఫీసర్ సృజన, సిబ్బంది సునీల్, సురేశ్, లింగం, కృష్ణ, మురళి, సంతోష్, దేవేందర్, లత, పూజ, నవీన్ తదితరులు ఉన్నారు.

బయోటెక్నాలజీ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ ఐలేని మహేందర్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 6 : టీయూ బయోటెక్నాలజీ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ ఐలేని మహేందర్‌ను నియమిస్తూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు నియామక ఉత్తర్వులు గురువారం అందించారు. విశ్వవిద్యాలయ చీఫ్ వార్డెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఐలేని మహేందర్.. గతంలో సారంగాపూర్‌లోని బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, అడిషనల్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా, యూజీసీ కో–ఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు.

డీవైఎఫ్ఐ మండల కన్వీనర్‌గా సురేశ్

రుద్రూర్, ఫిబ్రవరి 6 : డీవైఎఫ్ఐ మండల కన్వీనర్‌గా శ్రీనగర్ గ్రామానికి చెందిన సురేశ్‌ను ఎన్నుకున్నట్లు సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నెసాబ్ గురువారం తెలిపారు. యువత ఎదుర్కొంటున్న ఉద్యోగ, ఉపాధి, విద్య, వైద్యం కోసం డీవైఎఫ్ఐ పోరాడుతుందని పేర్కొన్నారు.

జిల్లా కేంద్రగ్రంథాలయానికి పుస్తకాల వితరణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 6 : నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి తెలుగు వెలుగు సమాఖ్య అధ్వర్యంలో వివిధ రకాల 26 పుస్తకాలను సమాఖ్య కార్యదర్శి బి.చంద్రశేఖర్ గురువారం అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డికి వీటిని అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ లైబ్రేరియన్ తారకం, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ చోరీ నిందితుడి అరెస్ట్

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 6 : బైక్ చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని పడకల్‌కు చెందిన మేకల సాయన్న బైక్ తన పశువుల కొట్టం నుంచి ఈనెల 2న చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. మండలంలోని మనోహరాబాద్ గ్రామశివారులో గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నిర్మల్‌కు చెందిన ముప్కాల రాకేశ్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా.. బైక్ చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితుడి నుంచి బైక్ స్వాధీనం చేసుకొని, కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు.

యాదగిరి సంస్మరణ సభ

సమావేశంలో మాట్లాడుతున్న వి. ప్రభాకర్

సిరికొండ, ఫిబ్రవరి 26 : మండలంలోని గడ్కోల్ గ్రామంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో యాదగిరి సంస్మరణ సభను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు వి.ప్రభాకర్ మాట్లాడుతూ.. యాదగిరి పార్టీకి, పేదలకు తన పోరాటాల ద్వారా సేవలందించారని కొనియాడారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు పిట్ల రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల తనిఖీ

ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్

ఖిలీల్‌వాడి, ఫిబ్రవరి 6 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ గురువారం తనిఖీ చేశారు. మొదటి స్పెల్ పరీక్షలు జరుగుతున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, సత్య ఒకేషనల్ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని మరో 15 కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు తప్పనిసరి అని, నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. తనిఖీల్లో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజీయొద్దీన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో గోసంగిలకు అన్యాయం

- గోసంగి కుల రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల సాయిచరణ్

సమావేశంలో మాట్లాడుతున్న గోసంగి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల సాయిచరణ్

సిరికొండ, ఫిబ్రవరి 6: ఎస్సీ వర్గీకరణతో గోసంగి కులస్తులు మరింత వెనక్కు నెట్టివేయబడుతారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల సాయిచరణ్ అన్నారు. తాము వర్గీకరణను స్వాగతిస్తున్నామని, కానీ తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. సిరికొండలో గురువారం నిర్వహించిన గోసంగి కుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాల, మాదిగల అనంతరం అత్యధికంగా ఉన్న గోసంగిల జనాభా కేవలం 23,251 అని చూపడం బాధాకరమన్నారు. ఎస్సీ ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, 2024 జనాభా లెక్కల ప్రకారం గోసంగి కులానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బెక్కం బాలయ్య, కోశాధికారి ధర్మపురి, సభ్యులు గంగన్న, రమేశ్, బాలకృష్ణ, నరేందర్, మహేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

ధర్పల్లి, ఫిబ్రవరి 6 : మండల కేంద్రానికి చెందిన ఇద్దరు సెల్‌ఫోన్లు ఇటీవల పోగొట్టుకోగా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై జాడి రామకృష్ణ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను గుర్తించారు. బాధితులను గురువారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సెల్‌ఫోన్లను అందజేశారు. బాధితులు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఇద్దరికి డాక్టరేట్

డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కందుకూరి వెంకటేశ్వర్లు

డాక్టరేట్ పట్టా అందుకుంటున్న పి. పద్మ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 6 : టీయూ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఇద్దరు పరిశోధక విద్యార్థులు డాక్టరేట్ అందుకున్నారు. పరిశోధక విద్యార్థి కందుకూరి వెంకటేశ్వర్లు 'ప్రిపరేషన్ స్టడీ ఆన్ మీథేన్ డికంపోజిషన్ ఓవర్ నికెల్ బేస్ట్ హెటిరోజినె కాటలిస్ట్స్ ఫర్ మాలిక్యులర్ హైడ్రోజన్ ప్రొడక్షన్' అంశంపై, పి. పద్మ 'ప్రిపరేషన్ డిజైన్ అండ్ సింథసిస్ ఆఫ్ సమ్ న్యూ మైక్రో నానో స్ట్రక్చర్ ఇనార్గానిక్ మెటీరియల్స్ ఆఫ్ ట్రాన్సిషన్ మెటల్స్ అండ్ దేర్ అప్లికేషన్స్ ఇన్ కాటలిసిస్' అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో పరిశోధన జరిపారు. టీయూలో గురువారం నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్లుగా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు జ్యోతి, వి.రవీందర్ హాజరై, పరిశోధన సిద్ధాంత గ్రంథంపై ప్రశ్నలు అడిగారు. పరిశోధక విద్యార్థులు ప్రయోగాత్మకమైన ఉదాహరణలతో సమాధానాలు ఇవ్వడంతో డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ మావురపు సత్యనారాయణరెడ్డి, డాక్టర్ బోయపాటి శిరీష, డాక్టర్ ప్రసన్న శీల, కాంట్రాక్ట్ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్

నవీపేట, ఫిబ్రవరి 6: విద్యార్థులు చదువుతోపాటు క్రీడ పోగాల్లోనూ రాణించాలని డీఈవో పార్శి అశోక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆభంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి డీఈవో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో అశోక్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భూమన్న, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంతలు తవ్వారు.. పనులు మరిచారు

గుంతలకే పరిమితమైన పనులు

భీమ్‌గల్, ఫిబ్రవరి 6: భీమ్‌గల్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో లైబ్రరీ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. భీమ్‌గల్, పల్లికొండ ప్రభుత్వ పాఠశాలలను పీఎం శ్రీ పథకం కింద గతంలో ఎంపిక చేశారు. పాఠశాలకు రూ.13 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆయా పాఠశాలల్లో గ్రంథాలయాలు నిర్మించాల్సి ఉంది. పల్లికొండలో పాఠశాలలో భవనం పనులు పూర్తి చేశారు. మండల కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పనులకు మోక్షం కలగడంలేదు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ మాక్లూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు నిరసన వ్యక్తం చేశారు. 61 ఏండ్లు పైబడిన వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

– మాక్లూర్, ఫిబ్రవరి 6

పరీక్ష అట్టలు, పెన్నుల వితరణ

నవీపేట, ఫిబ్రవరి 6: మండలంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం గ్రామ రాక్ స్టార్ గ్రూప్ యువజన సంఘం చేయూతను అందించింది. విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులను సంఘ సభ్యులు అందజేశారు. అంగన్‌వాడీ చిన్నారులకు పలకాబలపాలు అందజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సంజీవ్, గ్రామపెద్దలు కిషన్‌రావు, వివేక్‌రావు, లింగారావు, సాయిలు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

నందిగామ గ్రామంలో రాక్ స్టార్ యూత్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ మోబిన్, ఉపాధ్యక్షుడిగా దోర్నాల రాకేశ్, సలహాదారులుగా ఆరె సుమన్, పెంట ప్రవీణ్, కార్యదర్శులుగా శ్రీకాంత్, నరేశ్, ఆకాశ్, సాయికుమార్, వర్ధన్, నరేందర్ ఎన్నికయ్యారు. సభ్యులు సుధీర్, లక్ష్మణ్, లరుణ్ శేఖ్, ఆవేజ్, శ్రీకాంత్, నవీన్‌చారి పాల్గొన్నారు.

బాలికల రక్షణకు అందరూ కృషి చేయాలి

బాల్కొండ/రెంజల్, ఫిబ్రవరి 6: బాలికలను సంరక్షిస్తూ వారిని విద్యావంతులను చేయాల్సిన అవసరం అందరిపై ఉందని డీడబ్ల్యూవో రసూల్‌బీ అన్నారు. బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో గర్భిణులు, బాలింతలతోపాటు మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలతో కలిగే నష్టాలు, చట్టరీత్యా ఉన్న శిక్షలను వివరించారు. భ్రూణహత్యలు చేయొద్దని చెప్పారు. లింగ నిర్ధారణ చేయించుకోవద్దని, బాలికలను బాలురతో సమానంగా విద్య, సంస్కారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రెంజల్ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఎంఈవో అంజనేయులు, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రథ చక్రాలు విరాళం

రథ చక్రాలను అందజేస్తున్న దాతలు

ఏర్గట్ల, ఫిబ్రవరి6: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి గ్రామానికి చెందిన కమ్మరి రాజారపు బ్రహ్మయ్య కుమారుడు నర్సయ్య రూ.రెండు లక్షల 35 వేల విలువైన రథ చక్రలను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. వీడీసీ సభ్యులు మాట్లాడుతూ..రథానికి ఉన్న చక్రాలు పనిచేయక పోవడంతో కొత్త చక్రాలను నర్సయ్య విరళంగా అందజేశారని అన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు కారుపాకల నర్సయ్య, కోశాధికారి సోమలింగారెడ్డి, సభ్యులు సుమన్, రాజరెడ్డి, మల్యాల నర్సయ్య, గరిగే గంగాధర్, గడ్డం కొమురయ్య, దండవోయిన సాయన్న, పడిగెల పెద్ద గంగాధర్, కోల రాజేందర్ గౌడ్, పిట్ల మధు, కుశ రాకేశ్, ఎనుగంటి చిన్న లింబాద్రి, రాగి వడ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ సంఘం ప్రతినిధులను సన్మానిస్తున్న ముప్కాల్ కబడ్డీ అకాడమీ సభ్యులు

ఇండోర్ స్టేడియం పరిశీలన

ముప్కాల్, ఫిబ్రవరి 6: ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి వెళ్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ సంఘం ప్రతినిధులు ముప్కాల్ మండల కేంద్రంలోని భూదేవి ఇండోర్ స్టేడియాన్ని సందర్శించారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, ఒలంపిక్ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జగదీశ్ యాదవ్, రాష్ట్ర కబడ్డీ కోచ్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ట్రెజరర్ రవి, కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లేశం, రాజన్నసిరిసిల్లా జిల్లా సెక్రటరీ మల్లారెడ్డి, కోచ్ జ్యోతిశ్వర్, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ రవీందర్, సీనియర్ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు సతీశ్ గురువారం సందర్శించినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అంద్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధర్ తెలిపారు. వారిని ముప్కాల్ కబడ్డీ అకాడమీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావన్‌రెడ్డి, పీడీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి కృషి చేయాలి

మాట్లాడుతున్న మాదవానంద సరస్వతి

నవీపేట, ఫిబ్రవరి 6: వేల ఏండ్ల క్రితం నిర్మించిన జన్నేపల్లి శివాలయం చాలా విశిష్టమైనదని, ఆలయం శిథిలావస్థకు చేరుకున్నందున పునర్నిర్మాణానికి గ్రామస్తులు కృషి చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా తొగుట రంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. గురువారం ఈ శివాలయాన్ని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో గ్రామస్తులతో మాట్లాడారు. ఈ నెల 14న రాత్రికి శివాలయంలో తాను నిద్రిస్తానని 15న ఆలయ పునఃనిర్మాణంపై విధి విధానాలను ఖరారు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో క్యామాజీ సంజీవ్‌రావు, తెడ్డు పోశెట్టి, పురోహితులు శశంక్‌జ్యోషి, గ్రామస్తులు ఉన్నారు.

అభివృద్ధి బాటలో సహకార సంఘం

మాట్లాడుతున్న విండో చైర్మన్ భూమారెడ్డి

రెంజల్, ఫిబ్రవరి 6: మండలంలోని దూపల్లి సహకార సంఘం మహాజన సభను విడో చైర్మన్ భూమారెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సీఈవో జీవన్‌రెడ్డి జమాఖర్చులను చదివి వినిపించారు. రైతుల సహకారంతో సహకార సంఘం అభివృద్ధి బాటలో కొనసాగుతున్నదని చైర్మన్ పేర్కొన్నారు. సభలో డైరెక్టర్లు, రైతు నాయకులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో వైద్య శిబిరం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 6: పట్టణంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ చంద్రిక తెలిపారు. డాక్టర్ వసంత విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తప్పకండా పాటించాలన్నారు.

దుబాయ్‌లో పురాణీపేట్ వాసి మృతి

రాజేశ్వర్ (ఫైల్)

భీమ్‌గల్, ఫిబ్రవరి 6: మండలంలోని పురాణీపేట్‌కు చెందిన జడల రాజేశ్వర్(50) దుబాయ్‌లో గత నెల 29న గుండెపోటుతో మృతి చెందాడు. కొంతకాలంగా ఉపాధి నిమిత్తం ఆయన గల్ఫ్‌వెళ్తున్నాడు. ఇటీవల ఆయన స్వగ్రామానికి వచ్చి గతనెల 16న తిరిగి దుబాయ్‌కి వెళ్లాడు. అనంతరం 13 రోజులకే గుండెపోటుతో మృతి చెందాడు. అక్కడి బంధువులు, స్నేహితులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురానున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, ALKAPALLY SHIRISHA D/O. DEVANNA (Old Name) change my Name as GUNJALA TEJA SRI W/o. GUNJALA GANGA SRINIVAS (New name), H.No.3-31, Vill: Ameenapur, Mdl: Velpoor, Dist.Nizamabad-503